# చచ్చీ సాధించాడు!

బులుసు సీతారామమూర్తి

పూర్వం దానయ్య అనే ఒక గ్రామ పెద్ద ఉండేవాడు. ఆయన తన మామూళ్ళ విషయమై ఒక నియమం ఏర్పరచుకున్నాడు. అది ఏమిటంటే – ఆ గ్రామంలో మనిషిగాని, పశువుగాని పుట్టినా సరే చచ్చినా సరే నాలుగు రూపాయలు అతని చేతిలో పెట్టాలి ఈ నియమం గ్రామస్థులకు కష్టమనిపించింది కానీ, ఎవరూ ఏమీ చెయ్యలేక ఊరుకున్నారు.

ఇలా ఉండగా – ఒకనాడు దానయ్య తండ్రిది తద్దినం వచ్చింది. అవేళ ఒక బ్రాహ్మణ్ణి పిలిచి, "బాబూ! ఇనాళ మా తండ్రిగారు స్వర్గస్తులైన రోజు. అందుకని గోదానం ఇవ్వాలని వుంది. స్వీకరిస్తారా?" అని అడిగాడు.

దుర్మార్గుడైన దానయ్యకి ఇంతమంచి బుద్ధి పుట్టడం చూసి, ఆశ్చర్యపోయాడా బ్రాహ్మడు.

"ఏమిటీ? పుచ్చుకుంటారా లేదా? త్వరగా చెప్పండి. మీరు కాదంటే మరొకర్ని చూసుకుంటా – ఊఁ" అని తొందర పెట్టసాగాడు, దానయ్య.

ఆలస్యం చేస్తే బేరం పోతుందేమోనని ఆ బ్రాహ్మడు, "చిత్తం" అన్నాడు.

సరే. అయితే పట్టండి అని దానం ఇచ్చినట్టుగా బ్రాహ్మడి చేతిలో నీళ్లు వదిలాడు, 'ఫలానా విప్రావుని దానం ఇస్తున్నాను' అని.

తర్వాత పశువుల దొడ్డిలోకి తీసుకు వెళ్ళి ఆవుని చూపించాడు. అది చిక్కి శల్యమై వుంది. బ్రాహ్మడు చెయ్యి వెయ్యగానే అది 'హరీ' మని నేల గూలింది. బ్రాహ్మడు నివ్వెరపోయాడు.

"అయ్యో! మీ ఆవు చచ్చిపోయిందా? పాపం! నా మామూలు నాలుగూ ఇచ్చేసి మీ ఆవుని మీరు మోయించుకుపోండి" అన్నాడు.

అప్పటికి అర్థమైంది బ్రాహ్మడికి గోదానంలో వున్న కిటుకు. కానీ, వేరే దారిలేక తన బొడ్డున వున్న దక్షిణాల తాలూకు నాలుగు రూపాయలూ అక్కడ పెట్టి జారుకున్నాడు!

ఎందరినో ఏడిపించిన దానయ్యకు పెద్ద జబ్బు చేసి ప్రాణం మీదకి వచ్చింది. ఇక ప్రాణం పోతుందనగా దానయ్య గ్రామస్తుల నందరినీ పిలిచి, "బతికి వున్నంతకాలమూ మిమ్మల్నందరినీ ఏడిపించుకు తిన్నాను. అటువంటి పాపాత్ముడికి తగిన శిక్ష కూడా నేనే చెబుతున్నాను. వినండి నేను పూర్తిగా చచ్చాక నన్ను అందరిలాగా తగలెయ్యకండి. మహమ్మదీయుల గోరీల దగ్గర పారెయ్యండి నన్ను. అదే నాకు శిక్ష" అన్నాడు.

కక్ష గట్టిన గ్రామస్తులకు ఈ సలహా బాగా నచ్చింది. చచ్చిన తర్వాత దానయ్య శవాన్ని గోరీల మీద పారేశారు. కాని, అక్కడ నమాజు చేసుకుందుకు వచ్చిన మహమ్మదీయులు ఇది చూశారు "అరే కబడ్దార్! మా మసీదుని మైల చేస్తారా?" అని గ్రామస్తులందరికీ బాగా దేహశుద్ధిచేసి పంపారు.

"దానయ్య బతికీ సాధించాడు, చచ్చీ సాధించాడు" అని గ్రామస్తులు తిట్టుకుంటూ పోయారు.